# కొరకరాని కొయ్యలు

"మాట అట్టా మింద పడనీడమ్మా మణిసి! ఎవురి బిడ్డయితే ఏముండాది? నోరు తెర్సీతెరవక ముందే రడీమేడుగా ఉంటింది బొదులు. అయినా కడుపులో లేంది కావిలించుకుంటే వస్తొందా?"

మా బాశాలి నడవలో తీరుబాటుగా కూసుణ్ణింది. ఒక్కొక్క ఆకుగా మునగాకు నాజూగ్గా వొల్సుకుంటా ఉండాది. కొంపలోనుండి బయిట పడ్డామని నేను ఎలబార్తా ఉండా. అప్పుడు ఉణ్ణెట్టుండి ఆపె మునిగె. ఇంక యాడబొయ్ తేల్తిందో చూద్దామని నేనూ వొక్కంట గెమనిస్తా ఉండా.

"ఒంటి కాలి మింద సతపోర్తే ఆబిడ్డ ఒక యింటిదాయ. ఇంటిదైతే సరిపోతిందా? ఆ యింటికేం గావాల్నో కూసాల మాదిర మీసాలుండే మొగోళ్లకే తెలవకుండాబోతే యింక ఎవురికి తెలిస్తింది? వొచ్చిన అల్లుడంటేనా నోట్లో నాలికలేని మణిసి. అయినా ఏమడిగింది? కొండమిందుండే ఆ గుడినేవన్నా రాసియ్యమని అడిగిందా? ఆ కిర్సనాలు స్టౌతో పడలేకుండా ఒక గ్యాస్‌స్టౌ కనెక్సన్ అడిగింది."

ఒరే! మొగలాయి యాడ మునిగి యాడ తేలె? అట్టాయిట్టా పొయ్ మల్లా తలతిరిగి నోటికాడికే వచ్చినట్టు నాకాడికే వచ్చి తేల్నే? నా అరికాలి మంట ఉచ్చి కెక్కె.

"అదేమన్నా చెట్లో కాయా? ఏదో ఒక పడరాని బాదపడి కోసుకొనొచ్చి యిచ్చే దానికి! ఇది అట్టగాక పాయనే!"

"అట్టగాక పొయ్యిందానివల్లే గదా నిన్నుబట్టుకోని అల్లాడ్తా ఉండేది."

"నువ్వు నన్ను పట్టుకోని అల్లాడ్తా ఉంటే నేను యింకొకర్ని పట్టుకోని అల్లాడ్తా ఉండ్లా?"

"అల్లాడే దానికి నీకేం గాచ్చారమే? ఎమ్మెల్లేలు జోబీలో ఉండ్రి. ఎంపీలు అర్సేతిలో ఉండ్రి. ఇంక మంత్రులైతే ఒక కంచం ఒక మంచమేగదా?"

''ఎవుడా మాట అనింది?''

''దినానికి ఒకసారి గాదు. అర్వైఆరు సార్లు ఆనోటితో కూస్తానే మల్లా ఎవుడా మాట అనిందని అడిగితే యింక నేనేం చెప్పాల?''

''అర్వైఆరు సార్లు గాదు తొంబైఆరు సార్లు అనుంటా. ఉండారు కాబట్టే అనుంటా. అయితే వాళ్లందురూ నా అర్సేతిలోనో నాజేబిలోనో ఉండారని నేనన్లేదే?''

''ఏమో నాకేంతెల్సు? మాట మాటకు నాళ్ల మాటెత్తి ముందర పెట్టుకుంటా ఉంటే...''

''ముందరగాదే! పిచ్చిదానా! ఎత్తి నెత్తిన పెట్టుకుంటా ఉంటేగూడా ఆడికే ఏడస్తా ఉండాదే బతుకు.''

''ఏడ్సేది నువ్వు! అనేది నన్నా? బాగుండాదే వర్స. అందులో పస లేక పాయ్‌నా అర్లో మంచం ఎయ్‌మన్నెట్టు!''

''ఈ ఎత్తిపొడుపు మాట్లేగదా వద్దనేది! ఎన్నిసార్లు నెత్తినోరు పెట్టుకోని మొత్తుకుణ్ణా నీకు చెవల్లో పడనంటా ఉండాది. నాగ్గానా రగిలిందంటే?''

''ఈ బుడ్డబెదిరింపులకేం తక్కువ లేదమ్మా?'' అంటా మా బాశాలి ఒక్కయిసుర్లో యింట్లోకి పాయ. ఈ యింటికంటే గుడే బద్రం అనుకుంటా నేను గడప దాటుకుంటి.

దోవన పడి నడస్తా ఉండనన్న మాటే గానీ మణుసు ఒక దోవలో లేదే? ఈ ఆడోళ్లుండారే ఏం మణుసులో ఏం పాడో? తెల్సి మాట్లాడ్తా ఉండారా? తెలవకుండా మాట్లాడ్తా ఉండారా? అర్తమే గాదు. మాట పొయ్యేతీరు అర్తం గాకుండానే మాట్లాడేస్తారు. అప్పిటికి వాళ్లకే బొరువు బాద్దెత తెల్సినట్టు...! వాళ్ల మూలకంగానే సంసారాలు నిగ్గేటట్టు! నిగ్గేటట్టేంది?– వాళ్లవల్లనే పొద్దుపుట్టి తెల్లార్తా ఉణ్ణెట్టు! వాళ్లకే నోరుండాదని వాగేస్తారు. ఎదుటి మణిసి గూడా మణిసే అనే గ్నానం ఉంటిందో ఉండదో? మల్లా తిరుక్కోని ఒక్క మాటంటే చాలు. కండ్లల్లో రెట్లావుతో పెరుక్కుంటాయి.

అయినా ఆబిడ్డ కిర్సనాలు స్టౌతో అగచాట్లు పడ్తా ఉండేది నేను కండ్లారా చూళ్లేదా? చూసినా. బాదను గుక్కబట్టి మింగుకుణ్ణా. ఎకాఎకిన ఎలబారిపాయ్ ఆ మణిసిని అడిగినా. అడిగినపుడంతా ఆ కారివేది–

''అర్రెర్రే! నిన్నగాక మొన్న చెప్తివి. అంతలోనే మర్సిపోతానా? చేస్తానంటి గదా?''

ఆ మాట్తో మల్లా ఒక వారందినాలు నోరు తెర్సేదానికి యీలుపడకుండా పోతింది. సరే! వారందినాలు గడ్సేది ఎంతసేపు? ఆ మొగలాయి చుట్టూ మనం తిరిగినట్టు సూర్యుడు చుట్టూ బూమి తిరగతా ఉండాది గదా. ఏది నిలబడినా అది మాత్రం నిలబడదు. చూస్తా ఉండంగానే వారం దినాలు గడ్సిపోతాయి. అప్పుడు అయ్యగారు మంచి కోపు మింద ఉండే సందు చూసుకోని ఎచ్చరిస్తే–

''ఒరే నీపాసుగూల! నీకు నీ సమస్సె వొగిటేనయ్యా. ఎమ్మెల్లేగ్గూడా అదొగిటే సమస్సె అనుకుంటే ఎట్టబ్బా మీతో ఏగులాడేది?'' అంటా యిరగబడి నవ్వతాడు. ఆ దెబ్బతో మల్లా వొక నెలదినాలు నోరు మూతపడి పోతింది. అయినా అవసరం మంది. పట్టు యిడవని యిక్లామార్కుడి మాదిర్తో కుయ్యోమొర్రో! అంటే–

''సరే! ఈ జనాలకంటే తెలివి లేదు. నీగ్గూడా లేదా? నాకు గ్యాపకం ఉండాది. తప్పకుండా చేస్తానయ్యా అంటే నువ్వా రంకుమొగుడి మాదిర్తో తగులుకుంటే ఎట్టబ్బా?'' అంటా యాష్టబోతాడు. ఇదంతా ఎత్తుకోనిబొయ్ మా బాశాలితో ఏమని చెప్పేది? ఎట్టని చెప్పేది? చెప్తే ఆమణిసి–

''రానీ నాబట్ట కొడుకు! ఓట్లు రాకుండా బోతాయా? వాడు గడపెక్కి రాకుండా బోతాడా? అప్పుడు నిల్దీసి కడక్కుండా బోతానా?'' అంటా నన్నే గడపెక్కనీదు. ఇంక నా చావు ఎట్టా చదరం చేసుకోవాల? చెంప దెబ్బ. గోడ పెట్టు. రొండూ వొకడికే అన్నెట్టుగా యింట్లో చూస్తే అట్టా! యీదిలో చూడబోతే యిట్టా! మణుసు కూడుడికినట్టు ఉడికి పోతా ఉండాది. అడుగు తెంపుగా ముందుకు పడ్తా ఉండాది. అట్నో యిట్నో తేల్సి పారేయాల్సిందే. 'ఈ కుంటి సాకులు కుదర్దబ్బా!' అని తెగేసి చెప్పేయాల్సిందే! అనుకుంటానే ఎమ్మెల్లే యింటికాడికి పోతి.

అప్పటికే ఆడ ఈసుళ్లు యిరగబణ్ణెట్టు జనం. ఉడ్డలుడ్డలుగా నిలబడుకోని ఎవుడి లోకం వాడిదిగా ఉండారు. ఏడుకొండలవాడి గుళ్లో అయినా సందు చూసుకోని నేరుగా పొయ్యేదాని కవితిందిగానీ ఎమ్మెల్లేల యిండ్లకాడ మంత్రుల బంగళాలకాడ అట్టా కుదిర్తిందా?

నా శాన్సు కోసరం ఎదుర్సూస్తా ఆడ నిలబడుకోనుండా!

''బార్యాబర్తలు ఒకే సోట పన్జెయ్యాలని రూలు. బార్య ఒక సోట ఉండాది. బర్త యింగొక సోట ఉండాడు. రూలు పాటికి రూలుండాది. బిస యీళ్ల శాతల్లో ఉండాది. మా బతుకులిట్టుండాయి. సామీ! అని మొరపెట్టుకుంటే చూస్తా చూస్తా నంటానే మూణ్ణెల్లు తిప్పుకున్నాడు. ఇప్పుడేమో చేస్తా చేస్తా నంటా ఉండాడు. ఏంచేస్తాడో. ఏంపాడో? అయినా వాళ్లనని ఏమి లాబం? మన అదురుస్టంగూడా ఆడికే యాడస్తా ఉంటే?'' అంటా ఒకాయిన వాపోతా ఉండాడు.

''నీదన్నా ట్రాన్సుపరు. వద్దంటే నూటతొంబైఆరు లిటిగేసన్లంటాయి. నాదేముండాది? తూ బెపా! జానడు పొడుగు రేసన్ కార్డు. ఒక్క పోన్ కొడ్తే తల్తో నడిచి రమ్మంటే వస్తింది. చేస్తా చేస్తా నంటానే ఉండాడు. చేస్తే గదా?'' ఇంకొకడి యాష్ట ఏడుబండ్ల కెత్తాల్సినట్టుగా ఉండాది.

అంతలోనే ఒక కద్దరు గుడ్డల ఆసామిని సాగనంపే దానికి ఎమ్మెల్లే బయిటికొచ్చె.

ఎక్కడి దొంగలక్కడ గప్‌చిప్. అడుగడుగు దండాల మాదిర్తో వొంగొంగి దండాలు! తప్పితిందా? నేను గూడా ఒక దణ్ణం పెడ్తి! నన్ను చూస్తానే–

''రాన్నా! రారా! ఈడెందుకు నిలబడుకున్నావే? నీ మాటే అనుకుంటా ఉండా. అంతలోకే వచ్చేసినావు. రారా!'' అంటా నాదగ్గిరి కొచ్చి బుజం మింద చెయ్యేసె.

ఇంక చూస్కో నాసామిరంగా! అందురి కండ్లు నా మిందనే. మా బాశాలి గానా ఈ సీను చూసుంటే అట్నే గుమ్మయ్‌పాయ్ పిడికిడు మిరపకాయిల్తో దిష్టిగూడా తీసేది. నాకైతే గ్యాస్‌కనెక్సన్ తల్తో నడ్సి నాబిడ్డ యిల్లు చేరుకున్నెట్టనిపించె. ఆ దెబ్బతో ఆయన ఎంట తెంపుగా నడిస్తి. లోపలికి పొయ్ కూసుంటానే-

''నా మింద శానా కోపంగా ఉండావు గదన్నా? అయినా నీమాదిర ఎర్రోడు ఈ లోకంలో ఎతికినా దొరకడు. ఆష్టరాల్! గ్యాస్ కనెక్సన్ ఏందన్నా? ఇన్నేండ్లుగా రాజికీయాల్లో ఉండావ్. అడిగితే గ్యాస్ ఏజెన్సీ అడగాల.సరే! నీ తలపాడు గొర్రెతోక గుర్రంతోక కావాలంటే అవితిందా? ఆ కత నాకిడ్సి పెట్టు. అర్జింటుగా ఈజాబు తీసుకోని చిత్తూరు కలెక్టర్ ఆపీసుకు పొయ్‌రావాలన్నా. నువ్వయితేనే ఆపని చెయ్యగలగతావ్!''

ఇంక నేనేం మాట్లాడేది?

ఈ జనాలకంటే తెలివి లేదు. నీగ్గూడా లేదా? అని అడిగిన మణిసేనా మాట్లాడ్తా ఉండేది? అని నోరు తెర్సుకోని చూస్తావుంటే అదెంతా ఏమీ పట్టించుకోనోడి మాదిర్తో-

''బోంచేసుకోని మద్దేణం మిందట ఎలబార్తే సరిపోతింది. కారో జీపో కావాలంటే యిస్తా. ఆడ చేసుకోని రావాల్సిన పనిగూడా అప్పుడే చెప్తా!''

ఏందో చెప్తారే 'పదపద నువ్వుండే చోట దూడను కట్టెయ్యాల!' అని. అట్టా మాదిర్తో ఇంక నువ్వు పోవచ్చు! అన్నెట్టుగా ఆయన యింకెవురి బుజంమిందనో చెయ్యేసె. ఇద్దురూ నవ్వుకుంటా రూంలోకి పొయ్‌రి. గెడేసుకుండ్రి! మొనగాడు నన్ను పొమ్మని చెప్పకనే చెప్పెసె!

అంతేగదా? నా సమస్సె వొగిటే. పాపం! ఆయన కెన్ని సమస్సెలు. ఎందుకంటే ఆయన పదిమంది మణిసి కదా. అటుమంటప్పుడు పది మంది పని ముక్కెమా? వొకడి పని ముక్కెమా? అందుకే గదా అట్నో యిట్నో తేల్సుకుందామని వస్తే తేల్సి చెప్పెసెనే? ఇంకేం చెయ్యాల? గబగబ ఇంటికి పోవాల. ఆదరా బాదరా అంత నోట్లో ఏసుకోవాల. ఎంటనే ఎలబారాల. ఎలబార్తావుంటే మా బాశాలి ఊరికే ఉంటిందా?

''ఈ కొంప కంటే పూటకూళ్ల కొంపలే ఎయ్యిరెట్లు మేలు గదమ్మా? చెయ్యి ఆరేదాకన్నా అట్ట కూసుంటారు. ఈ కొంపలో కత అట్టగాక పాయనే. వచ్చేది ఎత్తుగాళ్ల మిందనే. పొయ్యేది ఎత్తుగాళ్ల మిందనే. అట్టా పొయ్‌పొయ్ యాడ తొవ్వి తలకెత్తుకోనొచ్చి ఈ కొంపలో కుమ్మరిస్తా ఉండారో? ఏం పాడో? ఆ బగమంతుడికే ఎరిక! ఈడేమో మూడు మూసి ఆరు అతకతా ఉండాది.'' అంటా అంటుకుంటింది.

ఆపెది ఏం ఉండాది లే? ఎప్పుడూ ఉండే ఏడుపే! ఈ చెవ్వుతో యినేసి ఆ చెవ్వుతో యిడ్సిపెట్టేస్తే కాలం జరిగి పోతా ఉంటింది. అయితే అసలు మణిసి కత అట్టా కాకపోయనే?

కట్టెల్లో కంపల్లో కూడా కాలని యవ్వారంగా మిగిలి పాయనే! అడిగితే అడ్డం

చెప్పడు. మల్లా ఆ మాటే తల్సుకోడు. చేతకాదంటాడా? అనడు. చేస్తా చేస్తా నంటానే ఉంటాడు. చెయ్యడు. ఇటు మంటోళ్లను ఏమనాల?

ఇట్టా మాదిర ఆలోచించుకుంటా నడస్తా ఉంటే చిన్నప్పుడెప్పుడో చదువుకున్న బర్తృహరి పద్దెం గ్యాపకాని కొచ్చె. ఆ మహన్నబావుడేం చెప్పినాడు-

తన పనుల్ను వదులుకోని గూడా యితర్ల పనుల్ను చేసి పెట్టేవాడు ఉత్తముడంట. తన పన్ల తాను చేసుకుంటా యితర్ల పన్లగూడా చేసిపెట్టే వాడు మద్దెముడంట. తన పనేవో తానేమోగా బతికేవాడు నీచుడంట. తన పన్ల కోసరం యితర్ల పన్లు చెడదొబ్బే వాళ్లను ఏమనాల్నో ? ఆయనకే తెలవలేదంట! ఆకాలాన అటుమంటోళ్లు లేరేమో? -

తన పన్ల కోసరం యితర్ల పన్లు చెడదొబ్బే వాళ్లను ఏమనాల్నో తెలవకుండాబోతే యింక యిట్టామాదిర చేస్తా చేస్తా నంటానే చెయ్‌కుండా ఉండేవాళ్లను ఏమనాలో ఒకేళ ఆయన బతికుంటే మాత్రం అడిగితే చెప్పగలగతాడా? ఏమో? నాకు మాత్రం నమ్మకంలే. అయితే యింకెవుర్ని అడగాల? -

అడిగితే మా ముత్తారెడ్డన్ననే అడగాల! అని అనుకుంటా వస్తావుంటే ఆ నాలుగ్గాళ్ల మండపం కాడ ఆయన్నే ఎదురు పడె. ఆ యన్ననే అడిగితి!

''ఈ సందేహం నీకెందు కొచ్చింది రా?'' అని అడిగె.

ఒక్క అచ్చిరం పొల్లుబోకుండా ఎమ్మెల్లే కతంతా చెప్తి.

అంతా మెదలకుండా యినె. ఆమిందట యిరగబడి నవ్వె! ఎందుకు నవ్వతా ఉండాడో అర్తంగాకుండా ఆయనకల్లానే చూస్తా ఉంటే-

''ఒరే పిచ్చోడా! చేస్తానని చెప్పి చెప్తానే చేసేస్తే ఆమిందట నువ్వే గాదు- యింకెవ్వురైనా వాళ్ల దగ్గిరికి ఎందుకు పోతారు? ఎవురు పోతార్రా? చేస్తా చేస్తానని చెప్తానే ఉండాల. నిజిమనుకోని మీబోటోళ్లంతా చేస్తాడనుకుంటానే వాళ్ల చుట్టూ తిరగతా ఉండాల. తిరగతా తిరగతా వాళ్లు కాల్తో చెప్పిన పన్లు చేత్తో చేస్తానే ఉండాల. అదే నాయికుడి లచ్చణం. వాడే నిజిమైన నాయికుడు. ఒక ట్రాన్సపరు... ఒక రేసన్‌కార్డు... ఒక గ్యాస్‌కనెక్సనే కాదురా. అది ఏ సమస్సె అయినా సరే! అది సమస్సెగానే బతకతా ఉండాల. దాన్ని అడ్డం పెట్టుకోని ఈళ్లు రాజ్జిం ఏల్తానే ఉండాల. చావనీరు. బతకనీరు. ఇటుమంటోళ్లను ఏమనాల్రా?''

''నేను నిన్నడిగితే నువ్వే నన్నడిగితే ఎట్టన్నా?''

''ఇటుమంటోళ్లనేరా కొరకరాని కొయ్యలనేది!'' అంటా ముత్తారెడ్డన్న ముసి ముసిగా నవ్వుకుంటా తనదోవన తానుపాయ.

ముందు పోతావుంటే ఎనక నిలబడి ఆయన్న కల్లానే చూస్తా బర్తృహరి కంటే మొనగాడుగా ఉండాడే! అనుకుంటి. ●